

అంకెల గారడీ బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. రూ.72వేల కోట్ల రైతుబడ్జెట్లో రైతుబీమా కోసం డబ్బులు లేవు. అందుకే ఫసల్ బీమాలో విలీనం చేశారు. ఏ అంశాన్ని చూసినా త్వరలో చేస్తాం, హామీలు పూర్తి చేస్తాం.. అనే మాట తప్ప ఎక్కడా అమలు చేస్తామని ప్రస్తావించ లేదు. గ్యాస్ సబ్సిడీ, వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్‌లను రెండు నెలలకోసారి ఇస్తున్నారు. బడ్జెట్లో మాత్రం సమయానికి ఇస్తున్నామని మాయమాటలు చెప్పారు. అబద్ధపు, అసత్యపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను విస్మరించింది.

-వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

వ్యవసాయ రంగానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి, రైతులకు మేలు చేసేవిధంగా ఉంది. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ రూపకల్పన చేశారు. వైద్య రంగానికి పెద్దపీట వేయడం, భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయం ఇవ్వడం సంతోషకరం. గృహలక్ష్మి, గృహజ్యోతికి ఇంకా ప్రాధాన్యం ఇవ్వాల్సింది. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తక్కువ బడ్జెట్ కేటాయించడం బాధాకరం. ప్రజాపాలన కొనసాగించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం శక్తికి మించి పనిచేయాల్సిన అవసరం ఉంది. బడ్జెట్లో కేటాయింపులు మాత్రమే కాదు వాటి అమలు కోసం కూడా కృషి చేయాలి.

-మంద పవన్, సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి

దళితులకు అన్యాయం



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎన్నికల హామీలను తుంగలో తుక్కింది. ఎస్సీ, ఎస్టీలకు న్యాయ ప్రకారం రావాల్సిన 18 శాతం వాటాను విస్మరించి అన్యాయం చేసింది. 18 శాతం కేటాయింపులు చేయాల్సి ఉండగా.. 11 శాతం ఇచ్చి చేతులు దులుపుకుంది. బడ్జెట్‌లో దళితుల వాటా రూ.52,409 కోట్లు కేటాయించాల్సి ఉండగా.. రూ.33,124 కోట్లను కేటాయించారు. అంబేద్కర్ అభయహస్తం అతీగతీలేదు. ఈ ప్రభుత్వం కేవలం ఉన్నతవర్గాల ప్రభుత్వం.

- పి.శంకర్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

బడ్జెట్‌లో ప్రజలకు భరోసా లేదు..



ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజలకు భరోసా లేదు. ఆరు గ్యారంటీలు.. 13 హామీల్లో ఏ ఒక్క పథకం అమలుకు నిధులు కేటాయించలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఒక గ్యారంటీ అయిపోయిందంటున్నారు. గృహిణులకు రూ.2,500, మహిళలకు వడ్డీ లేని రూ. 10 లక్షల రుణాల ఊసు లేదు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయకుండానే చేశామని ప్రకటించడం విడ్డూరంగా ఉంది. రైతు భరోసా ఎకరానికి రూ.15వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా బడ్జెట్‌లో ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. నిధులివ్వకుండానే ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు.

- రెడ్డి యాదగిరి, బీఆర్ఎస్వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు

చక్కెర ఫ్యాక్టరీకి బడ్జెట్ ఏదీ?



రాష్ట్ర బడ్జెట్‌లో నిజాం చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ బడ్జెట్‌ను కేటాయించకపోవడం శోచనీయం. బోధన్, మెట్‌పల్లి, మెదక్ చక్కెర కర్మాగారాలను పునరుద్దరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి రైతులలో ఆశాభావాన్ని రేకెత్తించింది. కానీ, నిధులు కేటాయించక మాట తప్పింది. విద్యా రంగానికి రూ.21,292 కోట్లను కేటాయించగా ఇది మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో 7.31 శాతం మాత్రమే.

- కొండల్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు




బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

బడ్జెట్ 2024-25

హామీలు తీరేలా.. సంక్షేమం సాగేలా..

- ఆరు గ్యారంటీలకే ప్రాధాన్యం
- ఎవుసానికి సై.. మహిళలకు జై..!



- ఉమ్మడి మెదక్ జిల్లాకు 40వేల ఇందిరమ్మ ఇళ్లు
- పటాన్‌చెరు వరకు మెట్రో రైలు ప్రతిపాదనలు
- రీజనల్‌రింగు రోడ్డుకు రూ.1,525 కోట్లు
- నీటిపారుదలశాఖకూ భారీగా కేటాయింపులు
- జిల్లా మంత్రుల పట్టుదలపైనే ప్రాజెక్టుల భవిత

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 25: ఉమ్మడి జిల్లాకు సంబంధించి బడ్జెట్‌లో గత పదేళ్లలో తగిన ప్రాధాన్యత ఉండేది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఇద్దరూ ఈ జిల్లా వాసులే కావడంతో నిధుల కేటాయింపులో ఢోకా లేకపోయింది. బడ్జెట్ నిధులతోపాటు ఎస్‌డీఎఫ్ నిధులలోనూ అగ్రస్థానం కల్పించేవారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న క్రమంలో అందరి దృష్టి ఇటువైపు మళ్లింది. అయితే వివిధ శాఖలకు భారీగానే కేటాయింపులు చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఇంచార్జి మంత్రి కొండా సురేఖలు పట్టుబడితేనే ఈ ప్రాంతంలోని పెండింగ్ పనులు, కొత్త అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతాయి.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేవిధంగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూపొందినట్లుగా కనిపిస్తోంది. గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పద్దుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గ్యారంటీల అమలుకు ఊతంగా నిధుల కేటాయింపు జరిగింది. వ్యవసాయం, నీటి పారుదల, విద్యా,వైద్యంతోపాటు మహిళా సంఘాలకు పెద్దపీట వేశారు. సంక్షేమమే ప్రధాన ఎజెండాగా అనేక అంశాలను పొందుపరిచారు. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేనప్పటికీ పథకాల వారీగా ప్రయోజనాలు దక్కనున్నాయి.

మెట్రో రైలు.. రీజనల్ రోడ్డు

సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న పటాన్‌చెరు వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని విస్తరిస్తామని బడ్జెట్ నివేదికలో పేర్కొన్నారు. మియాపూర్ జంక్షన్ నుండి పటాన్‌చెరు వరకు విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య నియంత్రణలోకి వస్తుంది. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్ వైపు వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ దూరంతోపాటు వ్యయప్రయాసలు తప్పుతాయి. ఇక గజ్వేల్, నర్సాపూర్, తూప్రాన్, సంగారెడ్డి పట్టణాలకు అనుసంధానంగా నిర్మించతలపెట్టిన రీజనల్ రింగు రోడ్డుకు ఈ బడ్జెట్‌లో రూ.1525 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే భూ సేకరణ జరుగుతుండగా.. పనులు ప్రారంభించాల్సి ఉంది.

రూ.22వేల కోట్లలో మన వాటా ఎంతో?

నీటిపారుదలశాఖకు సంబంధించి రూ.22వేల కోట్ల పైచిలుకు నిధులను బడ్జెట్‌లో కేటాయించారు. సిద్దిపేట జిల్లాలోని గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టిపెట్టారు. నిధుల కోసం పట్టుబట్టారు. తాజా బడ్జెట్‌లో ఆ శాఖకు ప్రాధాన్యత దక్కడంతో గౌరవెల్లిని పూర్తి చేయిస్తారనే ఆశలు నెలకొన్నాయి. ఇక సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల బాధ్యతను మంత్రి దామోదర రాజనర్సింహ పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటిపారుదలకు కేటాయించిన నిధులను ఈ రెండు ప్రాజెక్టులకు సద్వినియోగం చేస్తే అందోలు, నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల రైతులకు మేలు చేకూరుతుంది. మెదక్‌లోని ఘన్‌పూర్ ప్రాజెక్టు ఎత్తుపెంచేందుకు కూడా ప్రతిపాదనలు పంపారు. సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువలను నిర్మించాల్సి ఉంది. భూనిర్వాసితుల పరిహారం సైతం చెల్లించాలనే డిమాండ్ ఉంది.

ఈ అంశాలపై తప్పని నిరాశ..

- సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, చేర్యాల పట్టణాలను రెవెన్యూ డివిజన్లుగా మారుస్తారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కొత్త మండలాలు, విలీన ప్రాంతాల చేర్పుల మార్పులకు సంబంధించిన ప్రస్తావన లేకపోయింది.
- రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాల్లో ఇకో-టూరిజంను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఇందులో నర్సాపూర్ అడవులకు ప్రాధాన్యత కల్పించలేదు.
- సిద్దిపేట జిల్లాలో పామాయిల్ తోటలు పెద్ద ఎత్తున సాగుచేస్తున్నారు. గత ఏడాది పామాయిల్ కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించగా ఈసారి ఉద్యానవన శాఖ మొత్తానికే రూ.737 కోట్లు కేటాయించారు.

పేదలకు ఇళ్లపై ఆశలు

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని బడ్జెట్ నివేదికలో ప్రకటించారు. ఈ లెక్కన ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాలతో పాటు సిద్దిపేట జిల్లాలో విలీనమైన హుస్నాబాద్ నియోజకవర్గం, చేర్యాల, దూళిమిట్ట, కొమురవెల్లి,మద్దూరు, బెజ్జంకి మండలాలకు లబ్ది చేకూరనున్నది. మొత్తంగా 40వేల ఇళ్ల వరకు మంజూరయ్యే అవకాశం ఉంది. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున లబ్దిదారులకు జమ చేస్తారు. అదే విధంగా గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను చాలాచోట్ల పంపిణీ చేయలేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 8వేల ఇండ్లు ఉంటాయని అంచనా. వీటిని కూడా అర్హులకు పంపిణీ చేసామని తాజాగా ప్రకటించారు.

వ్యవసాయం, మహిళా సాధికారత

వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.72,659 కోట్లు కేటాయించడం విశేషం. రుణమాఫీతోపాటు ఎకరాకు రూ.15వేలు ఇచ్చేలా రైతుభరోసా, ప్రతీ రైతుకూలీకి రూ.12వేలు, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ తదితర కార్యక్రమాలకు ఈ నిధులు వెచ్చించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ ప్రయోజనం చేకూరబోతున్నది. ఇక ఇందిరా మహిళా శక్తి పేరిట తొలిదశలో 5వేల మహిళా స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికంగా ప్రోత్సహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 500 మహిళా సంఘాలు ఎంపికయ్యే అవకాశాలున్నాయి.



బడ్జెట్‌ను పరిశీలిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్‌లోకి పలువురు కౌన్సిలర్లు

- మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో చేరిక

సిద్దిపేట టౌన్, జూలై25: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో గురువారం హైదరాబాద్‌లో సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లు ఆలకుంట కవిత, పయ్యావుల పూర్ణిమ కాంగ్రెస్‌లో చేరారు. హనుమంతరావు కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడారు. అతి త్వరలోనే సిద్దిపేట మున్సిపల్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధి విధానాలు నచ్చే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. కౌన్సిలర్లుగా సిద్దిపేట మున్సిపల్‌లో జరిగిన అవినీతిని బట్టబయలు చేస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవంతో సిద్దిపేటలో కళకళలాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రియాజ్, నాయకులు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, ఆలకుంట మహేందర్, సందీప్ యాదవ్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, తప్పేట శంకర్, గ్యాదరి మధు, రాషద్, దుర్గాప్రసాద్, నర్సింగ్ యాదవ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ సిద్దిపేటలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ వారు వినూత్నంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ సాధించింది 'గుండు సున్నా' అని, ఆంగ్ల అక్షరాల్లోని జీరోలో మోదీ ఫొటోతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే, గురువారం గుర్తుతెలియని కొందరు ఆ ఫ్లెక్సీలను చింపేశారు. మొన్న చూసిన ఫ్లెక్సీలు నిన్న చిరిగిపోయి కనిపించడంతో అటుగా వెళ్తున్న పాదాచారులు, వాహనదారులు ఒకింత ఆశ్చర్యంగా గమనించారు.

- సిద్దిపేట టౌన్, జూలై 25

ఇష్టమైన వ్యక్తి చనిపోయాడని తెలిసి

యువతి ఆత్మహత్య

- ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతి
- విషయం తెలిసి యువతి ఆత్మహత్య
- అప్పటికే యువకుడికి పెళ్లై.. ఇద్దరు పిల్లలు

జగదేవ్‌పూర్, జూలై 25 : తనకు ఇష్టమైన వ్యక్తి ఇక లేడని తెలిసి ఆ యువతి.. అతను లేని జీవితం తనకెందుకు అనుకుందో ఏమో ఆమె కూడా ఆత్మహత్య చేసుకుంది. అప్పటికే ఆ యువకుడికి పెళ్లయి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. సదరు యువకుడు గురువారం తన పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా, ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ట్రాక్టర్ పై నుంచి వెళ్లడంతో చనిపోయాడు. ఈ విషయం తెలియగానే అదే గ్రామానికి చెందిన యువతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం లింగారెడ్డిపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమురవెల్లి సత్యం(31) తన పొలంలో గురువారం పొలం దున్నుతున్నాడు. పొలంలో నీరు ఎక్కువ కావడంతో పైపును పక్క పొలంలో వేయడానికి ట్రాక్టర్ దిగాడు. తిరిగి ట్రాక్టర్ ఎక్కుతుండగా, కాలు జారి పడిపోయాడు. ఈ క్రమలో ట్రాక్టర్ కేజ్ వీల్స్ సత్యం పై నుంచి వెళ్లాయి. పక్క పొలం రైతులు అతడిని గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన చిక్కుడు జ్యోతి(22) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే నివసిస్తుంది. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వారం క్రితం స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటోంది. ఏడాదిగా కొమురవెల్లి సత్యంతో జ్యోతి చనువుగా ఉంటుంది. సత్యం పొలంలో ట్రాక్టర్ కింద పడి చనిపోయిన విషయం తెలియగానే, ఆమె చలించిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. తల్లి మల్లమ్మ వచ్చి చూడగా, ఉరికి వేలాడుతూ కనిపించింది. ఆమె అరుపులు విన్న ఇరుగుపొరుగు వచ్చి జ్యోతిని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్జీలకు అందని కుట్టు కూలీ

- రెండు నెలలైనా అందని స్కూల్ యూనిఫామ్స్ కుట్టుకూలీ
- జిల్లావ్యాప్తంగా 60,755 డ్రెస్సుల తయారీ
- రూ. 45,56,625 పెండింగ్

సిద్దిపేట అర్బన్, జూలై 25 : ఆర్థికంగా ఎంతో కొంత ఆసరా కాకపోదా అని కూలీ తక్కువ అయినా కూడా పని చేసేందుకు ఒప్పుకున్నారు.. ఆలస్యమైతే పిల్లలు ఇబ్బందులు పడతారని రాత్రింబవళ్లు కష్టపడి సమయానికి యూనిఫాం అందజేశారు. ఇంత చేసినా వారికి అందాల్సిన కుట్టుకూలీలు రాక దర్జీలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌కు అవసరమైన మెటీరియల్స్ ఇచ్చి కుట్టి అందించే బాధ్యతను ప్రభుత్వం ఐకేపీ సిబ్బందికి అప్పగించింది. వీరికి అప్పగించిన సుమారు 60,755 యూనిఫాంలను సుమారు 1300 నుంచి 1400 మంది మహిళా టైలర్లు కుట్టారు. ప్రస్తుతానికి ఒక్కో విద్యార్థికి ఒక్కో జత యూనిఫాం మాత్రమే అందజేశారు. రెండవ జతకు సంబంధించి ఇంకా మెటీరియల్ రాలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్డర్స్ రాలేదు. అయితే ఇప్పటి వరకు కుట్టిన 60,755 యూనిఫాంలకు సంబంధించిన కూలీ మాత్రం ఇప్పటి వరకు రాలేదు. డ్రెస్ మెటీరియల్ అందజేసేప్పుడు అధికారులు ఒక్కో యూనిఫాంకు రూ.80 చొప్పున ఇస్తామని చెప్పారని, ఆ తర్వాత రూ.75 చెల్లిస్తామని, ఇప్పుడు రూ.50 మాత్రమే ఇస్తామని చెబుతున్నారని మహిళా టైలర్లు ఆవేదన చెందతున్నారు. ఈ విషయమై అధికారులను అడిగితే ఒక్కో యూనిఫాంకు ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుందని, ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి రూ.50 మాత్రమే మంజూరయ్యాయని చెబుతున్నారు. మిగిలిన రూ.25 త్వరలోయే మంజూరయ్యే అవకాశాలున్నాయని సమాధానమిస్తున్నారని మహిళా టైలర్లు వాపోతున్నారు. ఆ విడుదలైన రూ.50 కూడా ఇంత వరకు అందజేయకపోవడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా 60,755 యూనిఫాంలు కుట్టగా రూ.75 చొప్పున చూస్తే రూ.45,56,625 రావాల్సి ఉంటుంది. రూ.50 చొప్పున అయితే రూ. 30,37,750 రిలీజ్ అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తమకు త్వరితగతిన కుట్టుకూలీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.



స్కూల్ యూనిఫామ్స్ కుడుతున్న మహిళలు (ఫైల్)







కమ్మేసిన ముసురు

సిద్దిపేట టౌన్, జూలై 25: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో ముసురు ఇంకా కొనసాగుతున్నది. జిల్లాలోని పలుప్రాంతాల్లో చిరుజల్లులు కురవగా, మిగిలిన చోట్ల వర్షం పడింది. ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, వీస్తున్న గాలులతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఆకాశంలో మేఘాలు పూర్తిగా కమ్ముకోవడంతో చీకటి కమ్ముకుంది. ముసురు పడుతుండటంతో ప్రజలు గొడుగు సహాయంతో వివిధ పనుల నిమిత్తం అవసరమైతేనే తప్ప బయట వెళ్లలేదు. వాహనదారులు, పలు వ్యాపారస్తులు మాత్రం ముసురు వానలతో ఇబ్బందులు పడ్డారు.







పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానిస్తున్న అర్చకులు

కేతకీలో అదనపు కలెక్టర్ పూజలు

ఝరాసంగం, జూలై 25 : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి అభిషేక కార్యక్రమాలను చేయించారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఆర్ఐ.రామారావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

టేక్మాల్ సొసైటీ అవిశ్వాస ఓటింగ్ వాయిదా

టేక్మాల్, జూలై 25 : టేక్మాల్ సహకార సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన అవిశ్వాస ఓటింగ్ వాయిదా పడింది. శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు మెదక్ డీసీవో కరుణ పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు సొసైటీ కార్యాలయానికి డీసీవో చేరుకున్నారు. మెజార్టీ నిరూపించుకోవాలంటే రెండు/మూడో వంతు సభ్యులు అవసరమని, ఈ అవిశ్వాసం వీగినట్టేనని డీసీవో నిర్ణయించారు. దీంతో అవిశ్వాసం పెట్టిన డైరెక్టర్లు 12 మందికి 8 మంది ఉన్నామని తెలపగా, డీసీవో 9 మంది డైరెక్టర్లు ఉండాలని సూచించారు. మరణించిన డైరెక్టర్ పరిగణనలోకి రారని, అలాగే నోటీసులను 12 మందికే జారీ చేశారని డైరెక్టర్లు తెలిపారు. దీంతో తర్జనభర్జన పడిన డీసీవో శుక్రవారానికి వాయిదా వేసినట్లు ప్రకటించారు.

కేంద్రం బడ్జెట్‌తో రాష్ట్రానికి తీరని అన్యాయం

● జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



ఢిల్లీలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జూలై 25 : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ మండిపడ్డారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. ఇది కుర్సీ బచావో బడ్జెట్‌లా ఉందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తమ ప్రభుత్వాన్ని నిలుపుకోవడానికి బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తైలాలు ఇచ్చిందన్నారు. తమ కూటమిని అధికారంలో నిలుపుకోవడానికి సంతృప్తి వాద రాజకీయాలు అనుసరిస్తున్నారన్నారు. బీజేపీ క్విడ్‌ప్రోకో వ్యవస్థను నడుపుతున్నట్లు ఉందన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి బడ్జెట్‌లో ఏ మాత్రం నిధులు కేటాయించలేదన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారన్నారు. రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఓవర్ హాల్ యూనిట్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇక్కడి ప్రాజెక్టులకు జాతీయ హోదాపై బీజేపీ పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ పుట్టుకను ఇష్టపడని ప్రధానమోదీ అధికారంలోకి వచ్చిన నుంచి రాష్ట్రంపై వివక్ష కొనసాగిస్తున్నాడన్నారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తోపాటు బీజేపీ ఎంపీలు సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై తాము పార్లమెంట్‌లో నిలదీస్తామన్నారు. కాగా అంతకు ముందు ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు.

రుణమాఫీ సాఫీగా జరుగుతోందా?

గ్రామీణ వికాస్ బ్యాంకులో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆరా

రామాయంపేట, జూలై 25 : రైతు రుణమాఫీ ప్రక్రియ సాఫీగా జరుగుతోందా.. లేదా అనే విషయంపై మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం రామాయంపేట పరిధిలోని గ్రామీణ వికాస్ బ్యాంకును ఆకస్మిక తనిఖీ చేశారు. బ్యాంకుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. ఈ బ్యాంకులో ఇప్పటివరకు 924 మందికి గాను 240 మంది రైతులకు రుణాలు రెన్యువల్ కావడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు. మాఫీ విషయంలో ఏదేని ఇబ్బందులు ఏర్పడితే బ్యాంకర్లను ఆశ్రయించాల్సిందిగా కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ కిషోర్, వ్యవసాయ అధికారి రాజ్ నారాయణలను కలెక్టర్ సన్మానించారు.

రుణమాఫీ డబ్బును డిపాజిట్ చేసుకోవద్దు

● కొమురవెల్లి బ్యాంకు అధికారులకు సూచించిన లీడ్‌బ్యాంక్ మేనేజర్, డీఏవో

చేర్యాల, జూలై 25 : రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రుణమాఫీ డబ్బును డిపాజిట్లు చేసుకోకూడదని జిల్లా వ్యవసాయాధికారి మహేశ్, లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు కొమురవెల్లి ఏపీజీవీబీ బ్యాంకు అధికారులకు స్పష్టంచేశారు. ఇటీవల బ్యాంకు అధికారులు పలువురు రైతుల నుంచి డిపాజిట్లు సేకరించడం వివాదాస్పదమైంది. స్పందించిన వారు కొమురవెల్లి ఏపీజీవీబీని సందర్శించారు. రుణమాఫీ పొందినవారితో పాటు రెన్యూవల్ జాబితా వివరాలను అడిగితెలుసుకున్నారు. మాఫీ పొందిన రైతుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ బలవంతంగా డిపాజిట్లు తీసుకోకూడదని సూచించారు. బ్యాంకులో ఉన్న రైతులతో మాట్లాడి రుణమాఫీ అమలులో ఎదుర్కుంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. రూ.లక్ష లోపు రుణం ఉన్నప్పటికీ మాఫీ పొందని రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా వీరివెంట కొమురవెల్లి ఏవో నరేశ్ తదితరులున్నారు.

శిథిలావస్థలోని ఇళ్ల కూల్చివేత



ఇల్లును కూల్చివేస్తున్న సిబ్బంది

హుస్నాబాద్, జూలై 25 : హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా కాలనీలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గురువారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించవద్దని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ప్రజలను కోరారు. మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న టీటీసీ భవనంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొంకటి నళినిదేవి, ఎల్లయ్య తదితరులున్నారు.

తమిళనాడులో తప్పిపోయి క్షేమంగా ఇంటికి చేరిన మర్మాముల వాసి

మద్దూరు, జూలై 25 : లారీ క్లీనర్‌గా తమిళనాడు రాష్ట్రానికి వెళ్లి రెండు నెలల క్రితం తప్పిపోయిన మద్దూరు మండలం మర్మాముల గ్రామ వాసి క్షేమంగా ఇంటికి చేరాడు. గురువారం చేర్యాల సీఐ కార్యాలయానికి చేరుకున్న యాటెల్లి శ్రీకాంత్ భార్య యాటెల్లి కవిత, తల్లి తారతో కలిసి మాట్లాడారు. మే నెల 3న గ్రామానికి చెందిన బత్తిని కనకయ్య తన లారీపై తమిళనాడుకు క్లీనర్‌గా వెళ్లేందుకు స్థానికుడైన డ్రైవర్ పున్నం చందర్‌రెడ్డితో పంపించాడన్నారు. అక్కడకు వెళ్లాక 5న నమకల్ జంక్షన్ వద్ద లారీ నిలిపారని, ఇద్దరం కలిసి మద్యం తాగామన్నారు. మళ్లీ మద్యం కోసం పంపించగా వెళ్లి వచ్చే సరికి లారీ కన్పించలేదన్నారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అక్కడున్న వారు కొట్టి పోలీసులకు అప్పగించారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు రూ.50 ఇచ్చి రైల్వే స్టేషన్‌లో వదిలి ఇంటికి వెళ్లాలని సూచించారని తెలిపారు. తనకు చదువురానందున తెలియక కేరళకు వెళ్లే ట్రైన్ ఎక్కి దిగానన్నారు. అక్కడ అడుక్కుంటూ ట్రైన్‌లను మారుతూ బుధవారం మధ్యాహ్నం వరంగల్‌కు చేరుకున్నాను. అక్కడ తెలిసిన వాళ్లు కనిపిస్తే డబ్బు అడుక్కుని ముస్త్యాలకు చేరుకోగా మర్మాముల వారు కన్పించి ఇంటికి చేర్చారన్నారు. కాగా ఈ విషయమై శ్రీకాంత్ క్షేమంగా ఇంటికి చేరుకున్నాడని తమిళనాడు పోలీసులకు సమాచారం అందించినట్లు మద్దూరు పోలీసులు తెలిపారు.

'కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి'



మాట్లాడుతున్న చైర్మన్ రాజమౌళి, అధికారులు

గజ్వేల్, జూలై 25: కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో వెటర్నరీ డాక్టర్ రమేశ్‌బాబు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్యతో కలసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మునిసిపల్ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని తమ దృష్టికి వచ్చిందన్నారు. వారితో వైస్ చైర్మన్ జకీయోద్దీన్ కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, రహీం, నాయకులు శ్రీధర్, శివకుమార్, రవిందర్ తదితరులున్నారు.

మురుగుకాలువలను పరిశీలించిన కమిషనర్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 2వ వార్డు పరిధిలో ఉన్న రాజిరెడ్డిపల్లిలో మురికికాలువలను మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గుర్తించిన ఆయన వెంటనే తగు చర్యలను చేపట్టాలని మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఆయనవెంట టీపీవో ఎల్ శ్రీధర్‌రెడ్డి, అధికారులు, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యల తిష్ఠ

- ఎంపీడీవో ఆఫీసుకు నల్లా నీళ్లే
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మద్దూరు, జూలై 25: ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉన్న మండల పరిషత్‌తో పాటు తహసీల్దార్, ఈజీఎస్, ఐకేపీ, పీహెచ్‌సీ కార్యాలయాల్లో కనీస సౌకర్యాల లేమి పరిష్కారానికి ఏళ్లుగా వేలెత్తి చూపిస్తున్నా అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదు. ప్రభుత్వాలు స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకుంటున్నా, ప్రభుత్వ కార్యాలయాల్లో అది మచ్చుకైనా కనిపించడం లేదు.

బకెట్లతో నీళ్లు..

తహసీల్దార్ కార్యాలయానికి నీటి సరఫరా లేదు. సిబ్బంది బకెట్లలో నీటిని తెచ్చుపెడుతున్నా అధికారులకు తప్ప సిబ్బంది వినియోగించలేని దుస్థితి. ఈజీఎస్, ఐకేపీ కార్యాలయాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసుకోవడంలో కార్యాలయ అధికారులు విఫలమయ్యారు. నీటి డ్రమ్ములు కార్యాలయం వెనుక వృథాగా పడి ఉన్నాయి. నాసిరకంగా ఏర్పాటు చేసిన సంపు కూలిపోగా దుర్వాసన వెదజల్లుతుండడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా వినియోగించుకోలేని పరిస్థితి. ప్రతీ నెలా మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రాథమిక



ఎంపీడీవో కార్యాలయంలో నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్డికి తాళం

ఆరోగ్యకేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రూ. 25 లక్షలు మంజూరైనా గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా పనులు ఆగిపోయాయి.

18 ఏళ్లుగా బోరు లేకుండానే..

రాజభవంతిని తలపించే రీతిలో 2006లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఎంపీడీవో కార్యాలయాన్ని అప్పటి రాష్ట్ర భారీ, మధ్యతరహా నీటిపారుదల శాఖామంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రత్యేకంగా కార్యాలయానికి నీటి వసతి కోసం బోరు ఏర్పాటు చేయలేదు. కొన్ని సంవత్సరాలు గ్రామపంచాయతీ నల్లా మీద, తర్వాత మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడ్డారు. 18 ఏళ్లుగా కార్యాలయానికి పాలకులు, అధికారులు ప్రత్యేకంగా బోరును ఏర్పాటు చేయడంలో విఫలమవ్వడంతో నేటికి నల్లా నీళ్లపైనే ఆధారపడటం శోచనీయం.

పైపైన మెరుగులు

మండల పరిషత్ కార్యాలయంలో కొలువుదీరిన గత పాలకవర్గం 13వ ఆర్థిక సంఘం నిధులు నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2,75 లక్షల డ్రా చేసి మరమ్మతులు, రంగులతో పాటు విద్యుదీకరణ పనులు చేపట్టింది. కామన్ బాత్‌రూంతో పాటు పైఅంతస్తులోని సమావేశపు హాల్, ఎంపీపీకు కేటాయించినా గదికి ఇరుపక్కల ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో తాళాలు వేశారు.

వర్షాలతో మరో సమస్య..

కార్యాలయంలోని లొద్ది పూడ్చివేయడంతో వర్షాకాలంలో నీళ్లు చేరి బయటకు వెళ్లలేని దుస్థితి. వర్షం నీళ్లు భవనం లోపలికి ప్రవేశించకుండా ఉండేందుకు కార్యాలయం పైఅంతస్తులో రేకుల కప్పుకు ఏర్పాటుకు గత ఎంపీడీవో నిధులు కేటాయించినా పనులు చేపట్టలేదు. కార్యాలయానికి వచ్చే జనరల్ ఫండ్‌తో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి కార్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులతో పాటు పాలకులు చొరవ చూప లేదన్న ఆరోపణలున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషిచేయండి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డికి నాయకుల వినతి



చాడ వెంకట్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న భూనిర్వాసితులు

గజ్వేల్, జూలై 25: మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డికి భూనిర్వాసితులతో కలసి గజ్వేల్ సీపీఐ నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేసిన భూనిర్వాసితులు మాట్లాడుతూ.. వ్యవసాయభూములకు సంబంధించిన నష్టపరిహారం, స్ట్రక్చర్ పరిహారం, ఇళ్ల పరిహారం, ప్లాట్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 60ఏళ్ల పైబడిన వారికి ప్యాకేజీ, బడి, గుడి, పాఠశాల, స్మశానవాటిక, వాటర్ ట్యాంకులు, నీటి సరఫరా ఇతరత్రా మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. అంతేకాకుండా ఉపాధిహామీ పథకాన్ని వర్తింపజేసేలా ప్రభుత్వంతో, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడాలని కోరారు. వారితో సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ తదితరులున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు కీలకం

- సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



సిద్దిపేట టౌన్: మున్సిపల్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, జూలై 25: ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమంలోనైనా భాగస్వాములై ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో స్వయం సహాయక సంఘం సభ్యులు కీలకంగా వ్యవహరిస్తారని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, కుక్కల బెడదపై కమిషనర్ ప్రసన్నరాణి, వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, మెప్మా సిబ్బందితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలపడాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం తీసుకువచ్చిందని, దానిలో భాగంగానే మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి సాధించుటకు పలు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. చిన్న పిల్లలను వీధుల్లోకి ఒంటరిగా వెళ్లనివ్వొద్దని, వీధి కుక్కలు గుంపులుగా ఉన్నచోట ఎవరైనా పెద్దవారు తోడుగా వెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దోమల వల్ల మలేరియా వ్యాపిస్తుందని, నివాసాలలో ఉండే నీటి హౌజ్‌లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు హనుమంతరెడ్డి, సాయికృష్ణ, రమ్య, జ్యోతి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

దుబ్బాక, జూలై 25: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించిన పుడే దేశం అభివృద్ధి చెందుతుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితా పేర్కొన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం మెప్మా ఆధ్వర్యంలో సమాఖ్య ఆర్పీలతో సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ రమేష్‌కుమార్, మెప్మా కోఆర్డినేటర్ రేణుక తదితరులున్నారు.

పీఆర్ఏఈ, ఎంపీవో బదిలీ

నంగునూర్, జూలై 25: మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పీఆర్ఏఈ, ఎంపీవో బదిలీ అయ్యారని ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ గురువారం తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో మాట్లాడారు. మద్దూరులో పని చేస్తున్న పీఆర్ ఏఈ వినయ్‌రెడ్డి హన్మకొండ జిల్లా భీమదేవరపల్లికి, కొమరం భీం జిల్లా ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్న పీఆర్ఏఈ గౌస్ మొహిద్దీన్ మద్దూరుకు, మద్దూరులో పని చేస్తున్న ఎంపీవో ఖాజామొయినుద్దీన్ జగదేవ్‌పూర్ మండలానికి వెళ్లగా కొమురవెల్లి మండలంలో పనిచేస్తున్న ఎంపీవో వీరరాజు మద్దూరుకు వచ్చారని తెలిపారు.

అంగడికిష్టాపూర్ పంచాయతీ కార్యదర్శిగా సిద్ధేశ్వర్

మర్కుక్, జూలై 25: మండలంలోని అంగడి కిష్టాపూర్ నూతన పంచాయతీ కార్యదర్శిగా సిద్ధేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు గీతా అంజనేయులు, గ్రామ నాయకులు మీసాల శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి

హుస్నాబాద్ టౌన్, జూలై 25: ఆర్టీసీ అమలు చేస్తున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు కోరారు. హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఆగస్టు 19న జరుగబోయే రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని హుస్నాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. స్వయంగా వెళ్లి రాఖీ కట్టలేని ఆడపడుచులు కార్గో పార్సిల్ ద్వారా పంపించవచ్చన్నారు. చిగురుమామిడి, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో ఈ ప్రత్యేక సేవలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సేల్స్‌టీమ్ లీడర్ రాజు, సేల్స్‌టీమ్ సభ్యుడు సురేష్, అన్వేష్, చంద్రమౌళి తదితరులున్నారు.

వారసంతను..

చిన్నకోడూరు, జూలై 25: వారసంతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నాగరాజు సూచించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో గురువారం వారసంతను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్‌చంద్ర, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు సాదిక్, కాంగ్రెస్ నాయకులు గణేష్, వెంకటేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

30న ఇసుక వేలం

మద్దూరు, జూలై 25: మద్దూరు పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లతో పాటు లారీని పట్టుకుని కేసు నమోదు చేసిన పోలీసులు ఇసుకకు తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు. ఆ ఇసుకను ఈ నెల 30న వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సంజీవ్‌కుమార్ తెలిపారు. 4 ట్రాక్టర్లు, లారీ ఇసుకకు నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనే వారు రూ. 5వేలు డిపాజిట్ చేయాలన్నారు.

అక్రమ పైప్ కనెక్షన్ తొలగించాలి

- కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శివకుమార్



అక్రమంగా ఇచ్చిన కనెక్షన్

సిద్దిపేట రూరల్, జూలై 25: మిషన్ భగీరథ ఒహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ నుంచి సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల తాజా మాజీ సర్పంచ్ ఇంటికి అక్రమంగా ఇచ్చిన పైప్ కనెక్షన్‌ను అధికారులు వెంటనే తొలగించాలని కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్ డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ఒహెచ్ఆర్ ట్యాంకుకు ఇచ్చిన కనెక్షన్ తొలగించాలని మిషన్ భగీరథ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోడ పర్శయ్య, కేవీపీఎస్ నాయకులు వైద్యరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నంది అవార్డుల ప్రదానం

కుకునూరుపల్లి, జూలై 25: హైదరాబాద్‌లో శ్రీ ప్రగతి స్వచ్ఛంద సంస్థ కుకునూరుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డికి గురువారం బంగారు నంది అవార్డులను ప్రదానం చేసింది.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

- ఏడీఏ బాబునాయక్



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఏ బాబునాయక్

కుకునూరుపల్లి, జూలై 25: అర్హులైన ప్రతీ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూలై 30 వరకు సవరణలు, ఆగస్టు 5 వరకు కొత్తగా రైతుబీమా నమోదుకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని ఆయన తెలిపారు. ఆయన వెంట ఏఈవో రజిత ఉన్నారు.

'వైన్‌షాప్ సిట్టింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి'

చేర్యాల, జూలై 25: కొమురవెల్లి మండలకేంద్రంలోని రెండు వైన్‌షాప్‌ల సిట్టింగ్ నిర్వాహకులు సమయపాలన పాటించకపోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐనాపూర్‌కు చెందిన కుడిక్యాల బాలమోహన్ ఇటీవల కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెట్‌లకు ఫిర్యాదు చేశాడు. నిబంధనలు తుంగలోతొక్కి అరఎకర స్థలంపైగా సిట్టింగ్ నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ సెలవు దినాలలో అధికధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు.

కార్మికుల జీతాలు చెల్లించాలి

- కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్ టౌన్, జూలై 25: హుస్నాబాద్ మున్సిపల్‌లోని పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. హుస్నాబాద్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో కార్మికులకు ఇచ్చే మాస్కులు, చేతి గ్లౌజ్‌లు, సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె ఇవ్వడం లేదన్నారు. మున్సిపల్ పాలకవర్గం కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు.

భక్తి, దేశభక్తి, జానపద గేయాల పఠనం

చేర్యాల, జూలై 25: మండలంలోని నాగపురి జడ్పీఎస్ఎస్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాల విద్యార్థులతో భక్తి, దేశభక్తి, జానపద గేయాలు, పద్యపఠనం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం కవి, వేణుగాన కళాకారుడు పాశికంటి జనార్దన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, లక్ష్మణ్, పద్మ, అందె విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్, నిరుపమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలి

- అదనపు డీసీపీ మల్లారెడ్డి



సిద్దిపేట అర్బన్: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట అర్బన్, జూలై 25: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినిలకు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బాడ్ టచ్, గంజాయి, మత్తు పదార్థాలు, సీసీ కెమెరాలు, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, కళాశాల ప్రిన్సిపాల్, సిద్దిపేట షీటీం బృందం తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ రూరల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తోట మహేష్ సూచించారు. హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్‌లను దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల సందేశాలకు సమాధానం ఇవ్వకూడదని, ఎవరైనా ఓటీపీ కోసం కాల్ చేస్తే చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లేశం, షీ టీం బృందం సదయ్య తదితరులు ఉన్నారు.

రుణమాఫీ డబ్బులను వెంటనే జమచేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్



కొండపాక: రైతుకు చెక్కు అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేశ్

తొగుట/కొండపాక, జూల్ 25: ప్రభుత్వం మాఫీ చేసిన రైతు రుణమాఫీ డబ్బులను వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్ బ్యాంక్ అధికారులకు సూచించారు. గురువారం తొగుట గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రుణమాఫీ పొందిన రైతులు బ్యాంక్ వారికి తగిన పత్రాలను అందజేసి రుణమాఫీ డబ్బులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్, బ్యాంక్ మేనేజర్ జలందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేశ్ లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ హరిబాబుతో కలిసి దుద్దెడ యూనియన్ బ్యాంకులో రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు చింతల సుధాకర్‌కు మాఫీ అయిన 68 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవి శంకర్, కొండపాక మండల వ్యసాయాధికారి ప్రియదర్శిని, కొండపాక వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక పాల్గొన్నారు.

బదిలీలు సహజం

- మాజీ జడ్పీటీసీ రణంజ్యోతి శ్రీనివాస్‌గౌడ్



చేర్యాల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

దౌల్తాబాద్, జూలై 25: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఉద్యోగ జీవితంలో ఎక్కడా పని చేసినా మంచి పేరు తెచ్చుకోవాలని దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ రణంజ్యోతి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కుమారస్వామి, సత్యం, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామిని గ్రామంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివ, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, శేఖరప్పా తదితరులు పాల్గొన్నారు.

- **చేర్యాల:** చేర్యాల మండలం చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన 10మంది ఉపాధ్యాయులను గురువారం గ్రామస్థులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మిరుదొడ్డి, జూలై 25: విద్యార్థులు ఇష్టంతో చదవడం వల్ల మంచిఫలితాలు సాధించవచ్చని సామాజిక సమరసతవేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ పేర్కొన్నారు. మిరుదొడ్డి మండలం కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యూత్‌ఫర్ సేవా అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, డిక్షనరీలు, నోట్‌బుక్కులను అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, లక్ష్మన్ తదితరులున్నారు.



సిద్దిపేట బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా గురువారం సిద్దిపేట పట్టణంలోని వీరసావర్కర్ నుంచి పాత బస్టాండ్ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. వీర సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు భాసంగారి వెంకట్, పట్టణ అధ్యక్షుడు నగేష్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.
- సిదిపేట క్రైం

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- బీజేపీ భూపాలపల్లి కన్వీనర్ వెంకటరమణ

ములుగు, జూలై 25: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ భూపాలపల్లి కన్వీనర్ వెంకటరమణ ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని లక్ష్మక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్లో బీజేపీ ముఖ్య కార్యకర్తల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైను మాజీ జడ్పీటీసీ సింగం సత్తయ్యతో కలిసి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పల్లె రమేష్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, బద్రికుమార్, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై అధ్యక్షులు గుజ్జ రాజు, గుండెల్లి వేణు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు/గజ్వేల్, జూలై 25: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై మండల అధ్యక్షులు గుజ్జ రాజు, గుండెల్లి వేణు విమర్శించారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం చిన్నకోడూరులో బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై విభాగాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి కూడా ఎలాంటి లాభం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై నాయకులు రఘు, ఆనంద్, శ్రీను, భానుచందర్, లింగం, రాజశేఖర్ రెడ్డి, రాజిరెడ్డి, సాయికుమార్, మహేష్, రామకృష్ణ, అనిల్, తిరుపతి, సాయి, చందు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి కేంద్రం 2.6శాతం నిధులు కేటాయించడం అన్యాయమని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని సోమాజిగూడలో నిర్వహించిన సమావేశంలో గజ్వేల్ మండలానికి చెందిన తాటికొండ రవి యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గజ్వేల్ పట్టణంలో ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. వారితో జిల్లా కార్యదర్శి చంద్లాపురం మధు, ఉపాధ్యక్షులు నాచారం శేఖర్, దిలీప్, ప్రవీణ్, సందీప్, లోకేష్ తదితరులున్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం'

మిరుదొడ్డి, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం జరిగేవిధంగా ఉందని కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య బాగులు పేర్కొన్నారు. మిరుదొడ్డిలో గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా లేదని విమర్శించారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్, రాజు తదితరులున్నారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టాలని వినతి



కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

చేర్యాల, జూలై 25: వరద నీటి ప్రవాహ ముప్పు తీర్చేందుకు చేర్యాల మండలం కడవేరుగు గ్రామశివారులో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ కడవేరుగు, నాగపురి తదితర గ్రామాల రైతులు, కాంగ్రెస్ నాయకులు గురువారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కడవేరుగు చెరువు మత్తడినీటితో పాటు పంట పొలాల్లోని వరదనీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవ డంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కొమ్మూరి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇందులో గూడెపు మహేశ్, ఆరుట్ల వినీత్, రమేశ్, బాలచంద్రం, వెంకటస్వామి, డేవిడ్, బాబు, బాలయ్య ఉన్నారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి: పీఆర్టీయూ

బెజ్జంకి, జూలై 25: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను మంజూరు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు శశిధరశర్మ కోరారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఆ సంఘ సభ్యులు సభ్యత్వ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, మాలతి, తిరుపతిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి ధర్మయ్య, రాజేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

సిద్దిపేట అర్బన్, జూలై 25: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న చేపట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు బాల్ నర్సయ్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్, జిల్లా కోశాధికారి రాజనర్సు, సభ్యులు రాజమౌళి, ప్రభాకర్ , శ్రీనివాస్, సురేందర్, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ కాజేసేందుకు యత్నించిన ఆరుగురిపై కేసు

సిద్దిపేట క్రైం, జూలై 25: ఓపెన్ ప్లాట్‌ను కాజేయాలన్న ఉద్దేశంతో తప్పుడు పత్రాలు సృష్టించి మోసం చేయడానికి యత్నించిన ఆరుగురిపై సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణంలోని శివాజీనగర్‌లో విశ్వంత్ నందీశ్వరి భర్త విశ్వంత్ నాగేశ్వర్ బతికి ఉన్నప్పుడు దొమ్మాట మధుసూదన్‌రెడ్డితో కలసి 744 చదరపు గజాల ఓపెన్ ప్లాట్‌ను కొనుగోలు చేశారు. బిల్డింగ్ కట్టుకోవడానికి మున్సిపాలిటీ పర్మిషన్ కూడా తీసుకున్నారు. సిద్దిపేటకు చెందిన ఆరుగురు బాదర వేణి యాదవ్వ, మిద్దె రవీందర్, మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకం లక్ష్మణ్, మరుపల్లి యాదగిరి, మార్కంటి శ్వేతలు కలిసి బాదర వేణి యాదవ్వ పేరుపై కారు షెడ్‌పై ఇంటి నెంబర్ వేరే వేసి 325 గజాల స్థలాన్ని కాజేయాలని నకిలీ పత్రాలు సృష్టించి ఆరుగురు పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తర్వాత అయిదుగురు కలిసి మార్కంటి శ్వేత భర్త భరత్‌కుమార్ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. విశ్వంత్ నందీశ్వరి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రజక సంఘం ఆధ్వర్యంలో బోనాలు



బోనాలు ఎత్తుకుని వెళ్తున్న మహిళలు

బెజ్జంకి, జూలై 25: రజకుల కుల దైవమైన మడేలయ్యా స్వామికి మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం రజకులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డప్పు చప్పులతో మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా వెళ్లి తమ మడేలయ్యాకు సమర్పించారు.

ట్రాఫిక్ సీఐ రామకృష్ణ బదిలీ

సిద్దిపేట క్రైం, జూలై 25: సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ రామకృష్ణ సిద్దిపేట పోలీస్ కమిషనర్ పరిధిలోని సీసీఆర్బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్టీజోన్ వన్ ఇంటలిజెన్స్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కే.ప్రవీణ్ కుమార్ బదిలీపై వచ్చారు. గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీపై ట్రాఫిక్ సీఐగా వచ్చిన ప్రవీణ్‌కుమార్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.